క్లుప్తంగా

ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

లక్ష్మీపురం: పహల్గామ్ ఉగ్రహింస తరువాత పాకిస్తాన్ పై వరస దాడులతో సమర్థంగా విరుచుకుపడి వెంటనే ఆకస్మికంగా కాల్పుల విరమణకు అంగీకరించటం వలన మన దేశం టెర్రరిజంపై బేషరతు ఆధిపత్యాన్ని సాధించే అవకాశం కోల్పోయినట్లయిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ సైనిక వ్యవస్థను పతనం అంచుకు తీసుకువచ్చిందని చెప్పారు. విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య మాట్లాడుతూ 20వ శతాబ్దం చివరి నుంచి పాకిస్థాన్ సైన్యం కాపాడుతూ వచ్చిన ఉగ్రవాద సైదాంతిక స్థావరాన్ని శాశ్వతంగా నిర్వీర్యం చేయటానికి ఇప్పుడు వచ్చిన మంచి అవకాశాన్ని చేజార్చుకున్నట్లయిందన్నారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్.వెంకటరత్నం, న్యాయవాది హరి ప్రసంగించారు.

సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా

లక్ష్మీపురం: ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించాల్సి సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేసినట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. శనివారం మలేరియా డివిజన్ వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రేపు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ సోమవారం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలు అమలులో జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, పచ్చల శివాజీ, నాయకులు పి.వి.జగన్నాథం, బి.వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

హాస్యంతో మానసిక వికాసం



గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్యకర సున్నిత హాస్యంతో మానసిక వికాసం, ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన స్టాండ్ అప్ కామెడీ షో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్స్ స్మైల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామ్ కుమార్ మట్లాడుతూ సున్నితమైన హాస్య, వ్యంగ్యంతో సమకాలీన జీవనశైలిలో ఉన్న తప్పులను ఎత్తి చూపిస్తూ ఆహుతలను ఆకట్టుకునే ప్రదర్శన చేయడమే స్టాండప్ కామెడీ అని తెలిపారు. భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, ఇన్‌టాక్ గుంటూరు జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కళా పీఠం అధ్యక్షుడు విజయ్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణఉషశ్రీ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడిచేసిన వారిపై కేసు

లక్ష్మీపురం: వ్యక్తిపై దాడి చేసిన గాయపరిచడంతో కేసు నమోదు చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణబాబు కాలనీ ప్రాంతానికి చెందిన మన్నెం గోపి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 16న అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, సురేష్ వచ్చి అతడి భార్య గురించి చెడుగా చెప్పారు. తన భార్య గురించి అలా చెప్పడం మంచి పద్ధతి కాదంటూ గోపి అడ్డుకున్నారు. అదేరోజు రాత్రి గోపి ఇంటి ముందు ఉన్న చిల్లర దుకాణం వద్ద ఉన్న శ్రీనివాస్, సురేష్, సుభాని ముగ్గురు వచ్చి గోపితో వాగ్వాదానికి దిగారు. గోపిపై ఇనుప రాడ్డుతో దాడిచేశారు. క్షతగాత్రుడిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం బాధితుడు గోపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రివైజ్డ్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో గత ఏడాది అక్టోబరులో విడుదల చేసిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి రివైజ్డ్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శనివారం తెలిపారు. సవరించిన మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ధ్రువపత్రాలతో అందజేయాలన్నారు.

ఇంకా మురుగులోనే..



కొత్తపేట ట్రినిటి ప్యారిస్ చర్చి ఎదురుగా ఉన్న మురుగు



ఓల్డ్ క్లబ్ రోడ్డు(రామిరెడ్డితోట) మెయిన రోడ్డులో ఇంకా తొలగించని మురుగు



బ్రాడీపేట 2/3లో పేరుకుపోయిన మురుగు

నగరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. డ్రెయిన్లలో మురుగుపారుదల సక్రమంగా లేకపోవడంతో రోడ్ల మీదకు చెత్త చెదారంతో కూడిన మురుగు నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రి, అధికారులు, ఎమ్మెల్యేలు నివాసముండే ప్రాంతాల్లో శుభ్రం చేయించారు. నగరపాలక సంస్థ అధికారులు.. కొన్ని ప్రాంతాల్లో రోడ్లుపై మురుగు అలాగే ఉన్నా వాటిని తొలగించకపోవడంతో నగర ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. - నెహ్రూనగర్

వైద్యులు సమయపాలన పాటించాలి

- ఎంత మందికి మెమోలు జారీ చేశారు
- బ్లడ్ బ్యాంక్ ఆడిట్ చేశారా.. !
- బర్త్, డెత్ సర్టిఫికెట్లకు ఎన్ని రోజుల సమయం పడుతోంది
- జీజీహెచ్ హెచ్‌డీఎస్ సమావేశంలో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



ఎంఓయూ పత్రాన్ని తులసి రామచంద్ర ప్రభు, యోగీష్‌లకు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ, జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో హెచ్‌డీఎస్ సమావేశం శనివారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నాయి.. పర్యవేక్షణపై ఆరా తీశారు. పనిచేయని వారికి మెమోలు జారీ చేశారా.. లేదా అని సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను ప్రశ్నించారు. నలుగురికి మెమోలు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బ్లడ్‌బ్యాంక్ ఆడిట్ చేశారా.. లేదా తక్షణమే దానికి ఆడిట్ చేయించి వివరాలు అందజేయాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్ వద్దు..

ఆస్పత్రిలో వద్ద అన్న క్యాంటీన్ పెట్టాలంటూ హెచ్‌డీఎస్ సమావేశంలో మినిట్స్‌లో ఆస్పత్రి అధికారులు ప్రవేశపెట్టగా, దానిపై మంత్రి పెమ్మసాని చర్చ పెట్టారు. ఉచిత భోజనం ఆస్పత్రిలో ఉన్న దృష్ట్యా అన్న క్యాంటిన్ పెట్టాల్సిన అవసరం లేదని, దాని ద్వారా అనేక ఇబ్బందులు వస్తాయని పలువురు హెచ్‌డీఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అన్న క్యాంటిన్ ప్రతిపాదన విరమించుకున్నారు. కార్డియాలజీలో ఓసీటీ మిషన్లు ఇతర ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చేందుకు అనుమతులు ఇవ్వాలని వైద్యులు కోరారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్‌సిటీ పరీక్ష చేసేందుకు రూ.7 వేలు ఫీజు వసూలు చేసుకునేందుకు మంత్రి అనుమతి కోరారు. న్యూక్లియా టెక్నీషియన్ పోస్టు భర్తీ చేసేందుకు అనుమతులు కోరగా, మంత్రి ఒకే చేశారు. క్యాన్సర్ రోగులకు హై ప్రొటీన్ డైట్ ఇవ్వాలని, సాధారణ భోజనం పెట్టడం ద్వారా ప్రయోజనం ఉండదని నాట్కో క్యాన్సర్‌సెంటర్ కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డీఎంఈతో మాట్లాడి క్యాన్సర్ రోగులకు హైప్రొటీన్ డైట్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఆస్పతిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారిని తరలించేందుకు నిర్దేశించిన ఫీజుల ప్రకారమే మృతదేహాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రూ. 10 కోట్ల ఎంఓయూ

జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసేందుకు హెచ్‌డీఎస్ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు రూ.10 కోట్లు విరాళంగా అందజేశారు. సదరు విరాళంతో భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా శనివారం ఎంఓయూ పత్రాలు తులసి రామచంద్ర ప్రభుకు మంత్రి పెమ్మసాని అందజేశారు. డాక్టర్ యశశ్వి రమణ ప్రత్యేక చొరవతో తయారు చేసిన సమాచార దర్శిని పుస్తకాన్ని కేంద్ర మంత్రి ఆవిష్కరించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

సమావేశం అనంతరం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ హాస్పిటల్‌ను హెచ్‌ఆర్‌డీఎస్‌ను కో-ఆర్డినేట్ చేస్తూ అభివృద్ధి పనులను ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.డి.రసూల్, డాక్టర్ పీఎస్ హరిత, డాక్టర్ వి.వెంకట రమణ రావు, జింకానా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి. హనుమంతరావు, ఆర్‌ఎంఓ సతీష్ పాల్గొన్నారు.

దళిత ఉద్యమ కెరటం కలేకూరి



కలేకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: కలేకూరి ప్రసాద్ దళిత ఉద్యమ కెరటమని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జే విద్యాసాగర్ పేర్కొన్నారు. శనివారం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కలేకూరి వర్ధంతి నిర్వహించారు. భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ఆధ్వర్యంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కలేకూరి చేసిన రచనలు, పాటలతో దళిత ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. డప్పు ప్రకాష్ మాటకు కలేకూరి ప్రసాద్ పాటతోడై కారంచేడు, చుండూరు తదితర ఉద్యమాలకు బాసటగా నిలిచారని గుర్తుచేశారు. కవిగా, సినీ గేయ రచయితగా ఎంతో పేరు తెచ్చుకున్నారన్నారు. కలేకూరి ఆశయ సాధనకు నేటి తరం ఉద్యమ నాయకులు, దళిత, ప్రజా సంఘాలు పాటుపడాలని కోరారు. నీలాంబరం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అగ్రవర్ణ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు కలేకూరి ప్రసాద్ అని కొనియాడారు. తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమ కారుడిగా, కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఆకర్షితుడై అనేక రకాల బాధ్యతలను స్వీకరించారన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, కారంశెట్టి గోపి, కొరివి రజనీకాంత్, దాసరి ప్రవీణ్, చిలకా డేవిడ్ పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీ వినియోగానికి అధిక ప్రాధాన్యం

డీఆర్వో షేక్ ఖాజావలి



ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న డీఆర్వో షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: భూ వాతారణంలోని వేడిని తగ్గించేందుకు విరివిగా పచ్చదనం పెంపొందించడంతోపాటు గ్రీన్ ఎనర్జీ వినియోగానికి అధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే కార్యక్రమంలో బీట్ ద హీట్ కాన్సెప్ట్‌ను తీసుకున్నామన్నారు. పర్యావరణానికి అధిక వేడిని కలిగించే ఏసీలు, ఎనర్జీతో నడిచే ఫ్యాన్లు, లైట్లు, ఇతర గృహోపకరణాలు పొదుపుగా ఉపయోగించాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు నీడ ఉండే ప్రాంతాలు ఏర్పాటు చేయడం, మంచినీరు, మజ్జిగలాంటివి ఇవ్వాలన్నారు. నగరాల్లోని ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు పశువులు, పక్షుల దాహార్తిని తీర్చే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం డీఆర్వో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

నెహ్రూనగర్: పెట్రోల్ బంకుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్‌ఎస్ మాధూరి చెప్పారు. శనివారం పెట్రోల్ బంక్ డీలర్లతో పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు వారి యొక్క వాహనాల్లో పెట్రోల్/డీజిల్ నింపే సమయంలో మీటర్ రీడింగ్ జీరో చూపించాలని పేర్కొన్నారు. కొలతల్లో తేడా ఉన్నట్లు అనుమానం వస్తే లీగల్ మెట్రాలజీ వారిచే సర్టిఫై చేసిన ఐదు లీటర్ల కొనికల్ మెజర్‌తో పెట్రోల్, డీజీల్ కొలత చూసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. పెట్రోల్ నాణ్యతపై ఫిల్టర్ పేపర్ ద్వారా నివృత్తి చేయాలన్నారు. బంకు నిర్వాహకులు తాము ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఫ్యూయల్ డిస్పెన్సింగ్ పంప్‌ను క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం విధిగా లీగల్ మెట్రాలజీ వారిచే ధ్రువీకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ టి.షాలెంరాజు, అసిస్టెంట్ కంట్రోలర్లు జీ కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు అల్లూరయ్య, షేక్ జానా సైదా, ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ సేల్స్ ఆఫీసర్స్ వెంకట శివ, ప్రవీణ్, కునాల్, చంద్రకాంత్, గుంటూరు, పల్నాడు జిల్లాల పెట్రోలియం అసోసియేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఈఓ సుభద్ర, చైర్మన్ దుర్గావరప్రసాద్

నగరంపాలెం: నగరంలోని కొత్తపేట(నాజ్ కూడలి) శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు ఆదివారం నుంచి 22వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం దేవస్థానం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ షేక్ సజీల, దేవస్థానం ఈఓ టి.సుభద్ర, చైర్మన్ సూరిసేడి దుర్గావర ప్రసాద్, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవాధ్యక్షులు తిరువల్లూరు వెంకటసుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామి వారి హనుమజ్జయంతిలో భాగంగా ఈనెల 18వ తేదీ రాత్రి అంకురార్పణ, 19 ఉదయం పది గంటలకు లక్ష తులసి పూజ, 20వ తేదీ ఉదయం పది గంటలకు లక్ష మల్లెల పూజ, 21 ఉదయం పది గంటలకు లక్ష ఆకు పూజ, రాత్రి 8 గంటలకు శ్రీహనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. 22న హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 11 గంటలకు స్వామి వారికి సహస్ర ఘట్టాభిషేకం, రాత్రి 8 గంటలకు శ్రీసువర్చలా ఆంజనేయస్వామి కల్యాణం, 23 ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదాన ప్రసా ద వితరణ ఉంటుందని తెలిపారు. ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహచార్యులు, శ్రీహనుమాన్ దీక్షా సమాజం సభ్యులు చేపల నాగేశ్వర రావు, మాశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రమణ్యం, బాపిరాజు, టీడీపీ నేతలు కొనకళ్ల సత్యం, తిరువళ్లూరి పద్మావతి మాట్లాడారు.

- గుంటూరు కొత్తపేట(నాజ్ కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయం సాధవు క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. బావాజీ వారి పోషణలో కొంత కాలం పోషించబడగా, 1975లో దేవదాయ శాఖకు అప్పగించారు. ఈ స్వామి వారు భక్తులపాలిటి పెన్నిధి, భక్తుల కోరికలను నెరవేర్చే కల్పవృక్షంగా భాసిల్లుచున్నారు. జయంత్యుత్సవాల్లో భాగంగా దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందుల్లేకుండా మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. స్వామి వారిని దర్శించుకునే ందుకు రద్దీ లేకుండా ఉండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

మాతృమరణాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు మెడికల్: మృతమరణాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాయంలో డీఎంహెచ్‌ఓ అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ లెవల్ మాతృమరణాల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. గుంటూరువారితోట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఏప్రిల్‌లో సంభవించిన మాతృమరణాన్ని కమిటీ సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎల్ఏటీఓ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ ఆదిత్య ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, రాధికా రాణి, డీపీహెచ్‌ఎన్‌ఓ ప్రియాంక, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

కిల్కారి సేవలు పై సమీక్ష

గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కిల్కారి సేవలపై శనివారం సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాం ను గర్భిణులు, బాలింతలు కొరకు ప్రవేశం పెట్టిందన్నారు. గర్భిణి నాలుగో నెల మొదలుకొని బిడ్డకు సంవత్సరం వచ్చే వరకు కిల్కారి కాల్స్ వస్తాయని చెప్పారు. వాయిస్ కాల్స్ వారానికి ఒక సారి వస్తాయని, కాల్ 2 నిమిషాలు లోపు ఉంటుందన్నారు. కాల్ ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660 ను గర్భిణి మొబైల్ లో సేవ్ చేసుకున్నట్లయితే కాల్ వచ్చినప్పుడు పూర్తిగా సమాచారాన్ని వినవచ్చన్నారు. ఒక సారి విన్న సమాచారం తిరిగి వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి చేసి వినవచ్చని వెల్లడించారు. జిల్లా లో కిల్కారి గురించి బాగా పనిచేసిన ఆశలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ బాబు, డాక్టర్ రోహిణి రత్న శ్రీ పాల్గొన్నారు.

20న మండల, గ్రామీణ స్థాయిలో నిరసన కార్యక్రమాలు

లక్ష్మీపురం: గ్రామీణ, మండల స్థాయిలో ఈనెల 20న నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం బ్రాడీపేటలోని పి.ఎల్.రావు భవన్‌లో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారే తప్ప అమలు జరపడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. భూ యజమానితో సంబంధం లేకుండా కొత్త చట్టాన్ని తీసుకొచ్చి గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. లాడ్జి సెంటర్ నుంచి శంకర్ విలాస్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

నెహ్రూనగర్: నగరానికి రానున్న 20 ఏళ్ల వరకు తాగునీటి సమస్య రాకుండా ప్రాణాళికాబద్ధమైన ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం గుంటూరు నగర పాలక సంస్థ సమావేశం మందిరంలో అమృత్ 2.0లో నగరానికి మంజూరైన రూ.362.23 కోట్ల నిధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ విలాస్ ఆర్వోబీకి నిర్మాణానికి సహకరించిన భవన యజమానులకు చెక్కుల పంపిణీని మేయర్ కోవెల మూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మహ్మద్ నజీర్‌లతో కలసి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని తాగునీటి సరఫరా అవసరాల ప్రాతిపదికన మూడు ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలకు నీరు అందించడానికి కూటమి ప్రభుత్వం రూ.362.23 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గోరంట్ల పైప్ లైన్ ఏర్పాటుకు అమృత్ 2.0 నుంచి రూ.331.10 కోట్లు, అలాగే అమృత్ పాయింట్ల కింద ఉన్న లే అవుట్లకు వాటర్ సప్లయ్ నిమిత్తం రూ.32.13 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ డి.ఏడుకొండలరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు రూరల్ బుడంపాడులోని ప్రోడిజీ విద్యాలయ్‌లో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ ఏడుకొండలరెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో తాము నేర్చుకున్న అంశాలను మంచి అవగాహనతో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ కోర్టును క్రీడాకారులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఎం.సూర్యకుమారి, ప్రిన్సిపాల్ వై. రధినీచౌదరి పాల్గొన్నారు.

20వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె



లక్ష్మీపురం: సీహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆ జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, ట్రెజరర్ కె.సంధ్య కోరారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన సీహెచ్‌ఓల సమ్మె శనివారం 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లగా పని చేస్తున్న మాకు న్యాయ్యపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. ఎన్ని సార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోకపోవడంతో సమ్మె కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ప్రవల్లిక, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ, జిల్లా నాయకులు మేరీ పుష్ప, దివ్య, స్వాతి, మౌనిక జహీర్, సాయి పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: పైప్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నెహ్రూనగర్ రిజర్వాయర్‌కు క్లియర్ వాటర్ సరఫరా చేసే ప్రధాన పంపింగ్ లైన్‌పై హెడ్ వాటర్ వర్క్స్ కాంపౌండ్ లోపల ఎయిర్ వాల్వ్ లీకుకు మరమ్మతున్నట్లు చెప్పారు. మూడు గంటల పాటు తక్కెళ్లపాడు ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తిగా నిలుపుదల చేయడం ద్వారా సోమవారం సాయంత్రం నెహ్రూనగర్, శారదా కాలనీ, వసంతరాయపురం, హెచ్‌ఎల్‌ఆర్, ఐపీడీ కాలనీ, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, హనుమయ్యనగర్, ఏటీ అగ్రహారం, రెడ్డిపాలెం, గోరంట్ల, అడవితక్కెళ్లపాడు, రాజీవ్‌గాంధీనగర్, కోర్టు కాంపౌండ్, మిర్చి యార్డు, హౌసింగ్ బోర్డుకాలనీ, శ్యామలనగర్ రిజర్వాయర్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో నీటి సరఫరాలో పాక్షిక అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధతపై ఉచిత శిక్షణ

గుంటూరు మెడికల్: పేద, మధ్య తరగతి యువత ఉద్యోగాల సాధనే లక్ష్యంగా స్థాపించబడిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో బ్యాంక్, ఆర్.ఆర్.బి, ఎస్.ఎస్.సి. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా ,పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్యపురంలో సేవా దృక్పథంతో నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో మే 31 నుంచి కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కోచింగ్ లో ఆయా పాఠ్యాంశాలలో విశేష అనుభవం ఉన్న నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఉద్యోగం సాధించాలనే ఏకైక లక్ష్యం గలవారే సంప్రదించాలని కోరారు. మహిళా అభ్యర్థులకు ఉచిత నివాస వసతి కల్పిస్తామన్నారు .ఆసక్తిగల వారు కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో, మొబైల్ నెంబర్..9966112933కు సంప్రదించాలని కోరారు.

23న పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ

నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్థన సభ ఈనెల 23న ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసినట్లు క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేటలోని హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.